
ఆదాల హిమబిందు


ఓటేసేందుకు వృద్ధుడిని వీల్‌చైర్‌లో తీసుకువస్తున్న యువత


నెల్లూరులోని పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు తరలివచ్చిన ఓటర్లు


మూలాపేట ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద..


సంతపేట మోడల్ స్కూల్‌లో..

పోలింగ్ సందడి

నెల్లూరు నగరం, రూరల్ నియోజకవర్గాల్లో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఓటర్లు పోటెత్తారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులతోపాటు పలువురు రాజకీయ నాయకులు, అధికారులు, ఇతర ప్రముఖులు ఆయా పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటరు వేసేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుంచే ఓటర్లు క్యూలో బారులు తీరారు. పలుచోట్ల ఈవీఎంలు మొరాయించగా అధికారులు తగు చర్యలు తీసుకుని పోలింగ్‌ను పునరుద్ధరించారు. ఓటింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఎన్నికల సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలు, ఇతర సామగ్రితో వచ్చి రిసెప్షన్ సెంటర్‌లో అప్పగించారు. – సాక్షి నెట్‌వర్క్


మేయర్ స్రవంతి జయవర్ధన్


మున్సిపల్ కమిషనర్ వికాస్‌మర్మత్


డీఆర్‌ఓ లవన్న


నెల్లూరులోని పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు


నెల్లూరులో రిసెప్షన్ కేంద్రానికి వస్తూ..


రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోవిందరెడ్డి


డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, కుటుంబసభ్యులు


పోలింగ్ కేంద్రం వద్ద వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీచంద్రశేఖర్‌రెడ్డి


పోలింగ్ కంట్రోల్ యూనిట్‌ను చెక్ చేస్తూ..


రిసెప్షన్ కేంద్రానికి చేరుకుంటున్న పోలింగ్ సిబ్బంది


ఈవీఎంలను స్వీకరిస్తూ..

ఓటెత్తిన ఉత్సాహం

బారులు తీరిన ఓటర్లు

- కొన్ని బూత్‌లలో మొరాయించిన ఈవీఎంలు
- ఆలస్యంగా ప్రారంభమైన ఓటింగ్
- రాత్రి 8 గంటల వరకు పోలింగ్

నెల్లూరు(బారకాసు): నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గంలో సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ రాత్రి 8 గంటలకు వరకు కొనసాగింది. సిటీ నియోజకవర్గంలో ఓటర్లు మొత్తం 239,497 మంది కాగా ఇందులో పురుషులు 1,16,248, మహిళలు 1,22,708, ఇతరులు 67 మంది ఉన్నారు. వీరందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అధికారులు నియోజకవర్గం మొత్తంలో 248 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసి అక్కడ ఓటేసేందుకు వచ్చే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించారు.

ఆసక్తి కనబరిచిన ఓటర్లు

ఎన్నడూ లేని విధంగా ఈసారి ఓటింగ్‌లో పాల్గొనేందుకు ఓటర్లు ఎంతో ఆసక్తి కనబరిచారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభించగా ఓటర్లు ఉదయం 6 గంటలకే పోలింగ్ కేంద్రాలకు చేరుకుని క్యూలో వేచి చూడడమే ఇందుకు నిదర్శనం. దాదాపు 6 గంటలపాటు ఓటర్లు అన్ని పోలింగ్ బూత్‌లలో క్యూలో బారులు తీరారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారానే ఈ దఫా ఓటింగ్ శాతం పెరిగిందని పలువురు పేర్కొంటున్నారు.

మొరాయించిన ఈవీఎంలు

పోలింగ్ కేంద్రాల్లో సరిగ్గా ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉండగా కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించాయి. నగరంలోని జాకీర్‌హుస్సేన్‌నగర్, న్యూకాలనీలోని స్వయంసిద్ధిభవన్ 143వ నంబర్ పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో 45 నిమిషాల ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. అలాగే ఆర్‌ఎస్‌ఆర్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం తదితర చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో వాటిని తిరిగి యథావిధిగా పనిచేసేలా చేసి పోలింగ్‌ను పునరుద్ధరించారు. దీంతో గంట నుంచి రెండు గంటల సమయం ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. అయినప్పటికి ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండానే పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటర్లందరూ ఓటు వేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో రాత్రి 8 గంటలు అయినప్పటికి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



సంతపేట సెయింట్‌జోసఫ్ స్కూల్‌లో పింక్ పోలింగ్ బూత్‌లో ఓటు వేస్తున్న ఓటర్లు

పింక్ పోలింగ్ బూత్ ఏర్పాటు

మహిళా ఓటర్లు అధికంగా ఉన్న పోలింగ్ బూత్‌ను పింక్ కలర్ మయంగా మార్చి సుందరంగా తీర్చిదిద్దారు. నగరంలోని సంతపేట, సెయింట్‌జోసఫ్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 30వ నంబర్ పోలింగ్ బూత్‌ను ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. ఇందులో మొత్తం 1,353 మంది ఓటర్లు ఉండగా.. 756 మంది మహిళా ఓటర్లు, 597 మంది పురుషులు ఉన్నాయి. దీంతో ఈ బూత్‌ను పింక్ కలర్‌తో అందంగా ముస్తాబు చేశారు. ఈ పోలింగ్ బూత్‌కు వచ్చిన మహిళలు ఎంతో ఆనందంతో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

70 శాతానికి పైగా పోలింగ్

నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఓటింగ్ శాతం పెరిగింది. దాదాపు 70 శాతం వరకు ఓట్లు పోలైనట్లు సమాచారం. ఓటింగ్‌లో యువతతోపాటు వృద్ధులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మొత్తం ఓట్లలో పోలైన ఓట్లు ఎన్ని? ఇందులో పురుషులవి ఎన్ని? మహిళలవి ఎన్ని? అనే వివరాలు అర్ధరాత్రి వరకు కూడా తెలియరాలేదు.

పోటెత్తిన జనం

- నెల్లూరు రూరల్‌లో ప్రశాంతంగా పోలింగ్
- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- సమస్యను పరిష్కరించి పోలింగ్‌ను కొనసాగించిన అధికారులు

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. 275 కేంద్రాల్లో జనం పోటెత్తి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 6.30 గంటల నుంచే ప్రజలు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. తొలుత అన్ని రాజకీయ పార్టీల సమక్షంలో మాక్‌పోలింగ్ నిర్వహించారు. 7 గంటలకు పోలింగ్ మొదలైంది. పెద్ద ఎత్తున మహిళలు, వృద్ధులు తరలివచ్చి ఓట్లు వేశారు. బుజబుజనెల్లూరులో 118 పోలింగ్ బూత్‌లో 8.10 గంటల వరకు ఈవీఎంలు పనిచేయలేదు. కొండాయపాళెం బూత్‌లో ఉదయం అరగంటపాటు ఈవీఎం మొరాయించింది. అదే సమయంలో వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేణుంబాకం విజయసాయిరెడ్డి, నరసారావుపేట ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్ ఓటు వేయడానికి వచ్చారు. వారు కొంతసేపు వేచి ఉన్నారు. పలు ప్రాంతాల్లో తెలుగుదేశం నాయకులు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారు. యథేచ్ఛగా తిరుగుతున్నా పోలీసులు పెద్దగా పట్టించుకోలేదు. టీడీపీ నాయకులు పలువురు ఓటర్లకు నగదు పంపిణీ చేసినట్లు వైఎస్సార్‌సీపీ నేతలు ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. కాగా సాయంత్రం ఆరు గంటల తర్వాత కూడా ఓట్లు వేసేందుకు జనం భారీగా క్యూలో నిలబడ్డారు. నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కస్తూరిదేవి స్కూల్లో తన కుటుంబసభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అడిషనల్ అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి కనుపర్తిపాడులో, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ 12వ డివిజన్ చింతారెడ్డిపాళెంలో ఓటు వేశారు. 28వ డివిజన్ పొదలకూరు రోడ్డు జెడ్పీ హైస్కూల్‌లో ఏజెంట్ల విషయంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు జోక్యం చేసుకోవడంతో వివాదం సద్దుమణిగింది. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు అధికారులు, భద్రతా సిబ్బంది కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.


పోలింగ్ బూత్ వద్ద ఓటరు గుర్తింపు కార్డును పరిశీలిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

పోలింగ్ సరళి ఇలా..

సమయం	పోలింగ్ శాతం
ఉదయం 9 గంటలు	11.13
ఉదయం 11 గంటలు	22.84
మధ్యాహ్నం ఒంటిగంట	40.89
మధ్యాహ్నం 3 గంటలు	54.67
సాయంత్రం 5 గంటలు	64.65
పోలింగ్ పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది	

ఆదాల పరిశీలన

నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటింగ్ శాతం వివరాలను తెలుసుకున్నారు. అంబాపురంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మలిరెడ్డి కోటారెడ్డి పోలింగ్ సరళిని పరిశీలించారు.

టీడీపీ కుట్రలు

వెంకటాచలం: సర్వేపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభావిత గ్రామాల్లో పోలింగ్ సరళిని చూసి టీడీపీ నేతలు ఓటింగ్ సక్రమంగా జరగకుండా కుట్రలు పన్నారు. టీడీపీ నాయకులు పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చి రాద్ధాంతం చేసి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను రెచ్చగొట్టి దాడులకు పాల్పడ్డారు. వెంకటాచలం మండలంలోని గుడ్లూరువారిపాళెం, వెంకటాచలం, సర్వేపల్లి, ఈదగాలి, అనికేపల్లి గ్రామాల్లో పోలీసుల సాక్షిగా వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నేతలు దాడులకు దిగారు. గుడ్లూరువారిపాళెం పంచాయతీ పరిధిలోని 239 పోలింగ్ బూత్ వద్ద టీడీపీ నాయకుడు మురళీధర్‌రెడ్డి నానా హంగామా సృష్టించాడు. పోలింగ్ సక్రమంగా జరగకుండా చేయడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. పోలింగ్ సిబ్బంది కూడా టీడీపీ నాయకులకే అనుకూలంగా వ్యవహరించడంతో టీడీపీ నేతలు బరితెగించి వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు ప్రయత్నించారు. పోలింగ్ సిబ్బంది కూడా టీడీపీ నాయకులకు వత్తాసుపలికేలా వ్యవరించడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన మండలంలోని గుడ్లూరువారిపాళెం, పుంజులూరుపాడు, నిడిగుంటపాళెం, ఈదగాలి తదితర గ్రామాల్లో పర్యటించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేలా పోలింగ్ సిబ్బంది, పోలీసులు వ్యవహరించాలని సూచించారు. టీడీపీ నాయకులు దౌర్జన్యాలు, దాడులకు దిగుతుంటే పోలింగ్ సిబ్బంది వారికే మద్దతుగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. విధుల్లో పక్షపాతం చూపే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

వెంకటాచలంలో..

మండల పరిధిలో మొత్తం 53,218 మంది ఓటర్లు ఉన్నారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో 70 శాతానికి పైగా ఓటు నమోదైంది. మండలంలోని అనికేపల్లి, ఎగువమిట్ట, పూడిపర్తి, తిక్కవరప్పాడు, నిడిగుంటపాళెం, ఇడిమేపల్లి, కసుమూరు, చవటపాళెం, గొలగమూడి, కంటేపల్లి, సర్వేపల్లి తదితర గ్రామాల్లో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. మండలంలోని సర్వేపల్లి, గుడ్లూరువారిపాళెం, వెంకటాచలం, అనికేపల్లి గ్రామాల్లో ఈదఫా ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ హవా కొనసాగుతుందని టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ నాయకులను పదేపదే రెచ్చగొడుతూ పోలింగ్ సక్రమంగా జరగకుండా కుట్రలు చేశారు. టీడీపీ నాయకుల దౌర్జన్యాలను వైఎస్సార్‌సీపీ నాయకులు సహించలేక వాగ్వాదానికి దిగడంతో టీడీపీ నాయకులు దాడులకు పాల్పడ్డారు. టీడీపీ నాయకుల దాడులతో గుడ్లూరువారిపాళెం, వెంకటాచలం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులకు స్వల్ప గాయాలయ్యాయి.


అనికేపల్లిలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకుల మధ్య వాగ్వాదం

విద్యుత్ సిబ్బందికి ఎస్‌ఈ అభినందనలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా నిరంతరం పర్యవేక్షించిన అధికారులు, విధులు నిర్వహించిన సిబ్బందికి ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ అభినందనలు తెలిపారు. సోమవారం విద్యుత్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో వందల సంఖ్యలో సిబ్బందిని నియమించి విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కౌంటింగ్ జరిగే జూన్ 4వ తేదీ వరకు స్ట్రాంగ్ రూంల వద్ద అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి మూడు షిఫ్టుల్లో సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. పోలింగ్ సందర్భంగా జిల్లా విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేశారన్నారు.

టీడీపీ నేతల దౌర్జన్యకాండ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జొన్నవాడ గ్రామంలో టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడిచేసి గాయపరిచారు. గ్రామంలో 63వ పోలింగ్ బూత్‌లో వైఎస్సార్‌సీపీకి చెందిన ముంగర శివకుమార్ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. టిఫిన్ చేసి బూత్ లోపలికి వెళ్లే సమయంలో అక్కడున్న టీడీపీ సర్పంచ్ కందికట్టు పెంచలయ్య శివకుమార్‌ను అడ్డగించి బెదిరింపులకు దిగాడు. రాబోయేది టీడీపీ ప్రభుత్వమని.. నీ అంతు చూస్తానని దుర్భాషలాడారు. అక్కడే ఉన్న టీడీపీ కార్యకర్తలు ప్రణీత్, ప్రసాద్, పవన్, హరనాథ్(రౌడీషీటర్) ఒక్కసారిగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడి గాయపరిచారు. అడ్డుకోబోయిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సురేష్, వైఎస్సార్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు కందికట్టు మీనా తదితరులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న సీఐ హైమారావు అక్కడికి చేరుకుని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను కాపాడారు. కోవూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి జొన్నవాడలో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వెళ్లగా టీడీపీ సర్పంచ్ పెంచలయ్య ఇష్టమొచ్చినట్లు మాట్లాడారు. తాను ఎమ్మెల్యే అభ్యర్థినని పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వచ్చానని చెబుతున్నా వినకుండా పట్టించుకోకుండా దురుసుగా ప్రవర్తించారు.

పోలీసుల తీరుపై అసహనం

నెల్లూరు సిటీ: పోలీసుల తీరుపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని కొండాయపాళెంలో గల పోలింగ్ బూత్ వద్ద పోలీసులు సరైన భద్రత కల్పించలేదని ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, కలెక్టర్ హరినారాయణన్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసులు తగినంత భద్రత కల్పించకపోతే తమ సేవాదళ్ సభ్యులు వచ్చి సేవలందిస్తారని ఆయన తెలిపారు. సరిపడేంత సిబ్బంది లేరని పోలీస్ ఉన్నతాధికారులు అంగీకరించారు. ఘటన స్థలానికి ఎస్పీ చేరుకొని మాట్లాడారు.


ఎస్పీతో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

ఉదయం 6 గంటలకే పోలింగ్ కేంద్రాలకు..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం నెల్లూరు నగరంలోని 43, 51, 52, 53, 54వ డివిజన్లలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉదయం 6 గంటలకే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మహిళా ఓటర్లు తమ ఓటును వినియోగించుకునేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నగరంలోని 51వ డివిజన్ సంతపేటలోని సెయింట్‌జోసఫ్ బాలికల తెలుగు మీడియం పాఠశాల, 52వ డివిజన్ రంగనాయకుల పేటలోని మున్సిపల్ కార్పొరేషన్ ప్రైమరీ స్కూల్, 43వ డివిజన్ సంతపేటలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ వికాస్‌మర్మత్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు ఆనం జయకుమార్‌రెడ్డి పరిశీలించి ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు. అలాగే వెంకటేశ్వరపురం, జనార్దనరెడ్డికాలనీ, గాంధీగిరిజనకాలనీ, భగత్‌సింగ్‌కాలనీల్లో పోలింగ్ కేంద్రాలను వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర అభ్యర్థి ఖలీల్‌అహ్మద్ పరిశీలించి ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు. కామాటి వీధి, సంతపేటల్లోని పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 6 గంటలకు పోలింగ్ కేంద్రాల ప్రధాన గేట్లు మూసివేసి అప్పటికే క్యూలో ఉన్న వారు ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు అవకాశం కల్పించారు.


సంతపేట సెయింట్ జోసఫ్ స్కూల్‌లో పోలింగ్ కేంద్రం వద్ద కమిషనర్ వికాస్‌మర్మత్

వైఎస్సార్‌సీపీ భారీ విజయం ఖాయం

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ భారీ విజయం ఖాయమని, మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పోలింగ్ సరళిని మంత్రి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పొదలకూరు పట్టణంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. సర్వేపల్లిలో 75 శాతానికిపైగా పోలింగ్ జరిగినట్లు సమాచారం ఉందన్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల కంటే కంటే ఎక్కువ మెజారిటీ తనకు లభిస్తుందన్నారు. టీడీపీ అభ్యర్థి ఢీలాపడిపోయాడని, కొన్నిచోట్ల గొడవలు సృష్టించేందుకు ప్రయత్నిస్తే అభ్యర్థినే తరుముకున్నట్లు చెప్పారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పది స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందన్నారు. ప్రతిపక్షాలు రెచ్చగొట్టినా గొడవలకు దిగకుండా ప్రశాంత వాతావరణం మధ్య ఎన్నికలు జరిపించారని తెలిపారు. మంత్రి వెంట పార్టీ నాయకులు కోనం చినబ్రహ్మయ్య, పూకోటి లక్ష్మీనారాయణ, తుమ్మల శ్రీనివాసులు, వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎం.శివశంకర్, తుమ్మల ప్రసాద్, బీపీ నారాయణరెడ్డి, డి.విజయభాస్కర్‌రెడ్డి ఉన్నారు.


మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పార్టీ శ్రేణుల్లో విజయోత్సాహం

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు : వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో కనిపిస్తున్న విజయోత్సాహం ఫలితాలకు ముందే తేటతెల్లమవుతోందని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని నార్తురాజుపాళెం, కొడవలూరులో సార్వత్రిక ఎన్నికల సరళిని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొడవలూరులో మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్ వద్ద పార్టీ శ్రేణులు ఎంతో ఉత్సుకతతో పని చేస్తున్నారని చెప్పారు. పోలింగ్ శాతం గణనీయంగా పెరగడం పార్టీ విజయానికి ఎంతో దోహదపడనుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వెంట డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్‌సీపీ నేతలు తిరుపతమ్మ, రవి, చిన్నా, మురళి, ఎన్.నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.